క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

జామి: కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు కె.వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి బుధవారం పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు చేశామని అర్చకులు తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న రామ్మోహనరావు దంపతులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన కేతినేడి రామ్మోహనరావు, అనురాధ దంపతులు రూ.1,00,116 విరాళం ప్రకటించారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు అప్పికొండ ఆదిబాబు, దాసరి రవి, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్‌కు విజయాకాలనీలో రామ్మోహనరావు దంపతులు బుధవారం నగదు అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహాయం అందించేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ



ఉపాధ్యాయుడు అందజేసిన గొడుగులతో విద్యార్థులు

గంట్యాడ: వర్షాకాలం నేపథ్యంలో మండలంలోని చిన మధుపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆపాఠశాల ఉపాధ్యాయుడు దుర్గయ్య గొడుగులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో గొడుగులు అందించామని ఉపాధ్యాయుడు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



మృతుడి కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న సూర్యనారాయణరాజు

గుర్ల: మండలంలోని సొలిపి గ్రామానికి చెందిన అలిబిల్లి సూర్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. ఆయన గతంలో కెల్ల పీఏసీఎస్‌లో జనప్రియ బీమా పాలసీలో చేరారు. ప్రమాదంలో మృతిచెందడంతో రూ.లక్ష బీమా మంజూరయ్యింది. సంబంధిత చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు కెల్ల పీఏసీఎస్ అధ్యక్షుడు కె.వి.సూర్యనారాయణరాజు బుధవారం అందజేశారు. పీఏసీఎస్ సీఈఓ మండల శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు



కొత్తవలస ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిచిన వరద నీరు

కొత్తవలస : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి కొత్తవలస ఆర్‌టీసీ కాంప్లెక్స్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కొత్తవలస జంక్షన్‌కు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిని వరదనీరు ముంచెత్తడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తవలస మేజర్ పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మూడు గంటల పాటు ఏకదాటిగా కురిసిన వర్షానికి వాగులు, గెడ్డలు పొంగిపొర్లాయి.



కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ముడుకు లోతు నీటిలో వాహనచోదకుల ఇక్కట్లు

అవినీతి రహిత పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గొల్లుపాలెంలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు అవినీతిరహిత, పారదర్శక, సంక్షేమపాలన అందుతోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో బుధవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, స్థానిక, మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్ ఆదేశాలతో గడపగడపకూ వస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాల కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, అది కూడా టీడీపీ సానుభూతి పరులకే పథకాలు మంజూరయ్యేవని గుర్తు చేశారు. నేడు పథకాలతో పాటు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్నాయని, వీటి కోసం ఏ ఒక్కరికీ రూపాయి లంచం ఇవ్వాల్సిన పనిలేదన్నారు. పేదల సంక్షేమం కోసం దేశంలో ఏరాష్ట్రంలోనూ లేనన్ని పథకాలను మన రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు.

నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, ఇప్పటికే పలుగ్రామాలకు బీటీరోడ్లు నిర్మించామని, మరికొన్ని గ్రామాలకు రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గజపతినగరంలోని 30 పడకల సామాజిక ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి రూ.17 కోట్లతో భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసి రోగులకు కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో వైద్యసేవలు అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రూ.100 కోట్లతో జాతీయ రహదారి-26 విస్తరణ పనులు చేపడుతున్నామని, త్వరలోనే ఈ పనులు పూర్తికానున్నాయని చెప్పారు. గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభూజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, స్థానిక సర్పంచ్ పోతల రమణమ్మ, తహసీల్దార్ డి.ఎం.జి.ఎ.ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, రాచకిండాం,గొట్లాం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు గొల్లు సతీష్, మహంతి రమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, జిల్లా నాయకులు మీసాల తులసీరాం, బొద్దల చిన్నంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, మండల నాయకులు పోతల కన్నంనాయుడు, టి.సత్తిబాబు, కర్రోతు శ్రీనివాసరావు, తాళ్లపూడి అప్పలనాయుడు, పల్లి రామునాయుడు పాల్గొన్నారు.

నేడు ..

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీతో పాటు కిలపర్తివానిపాలెంలో గురువారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య పాల్గొంటారని, మండలంలోని సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణానికి ధీర ఫౌండేషన్ సహాయం



బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణసామగ్రిని అందజేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి పట్టణంలోని రుంకానవీధిలో ఏప్రిల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు ఇళ్ల నిర్మా ణాని కి ధీర ఫౌండేషన్ సహాయం అందించింది. బాధితులు రుంకాన కళావతి, రుంకాన అన్నపూర్ణ, రుంకాన బంగారమ్మ, జమ్ము నారాయణమ్మ కుటుంబాలకు రూ.160 లక్షల విలువైన గుమ్మాలు,కిటికీలు, తలుపులు, విద్యుదీకరణ సామగ్రిని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ భార్య మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి గరివిడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించిన రోజే ధీర ఫౌండేషన్ తరఫున ఒక్కో కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5 వేలు, నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులు అందజేశామని తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండల ప్రజాప్రతినిధులు బాధితులకు సహాయం అందజేశారని గుర్తు చేశారు. బాధితులకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేసిందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు 100 బస్తాల సిమెంట్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ సహకారంతో అందిస్తామని ఎంపీ చెప్పారు.జిల్లాలో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా ధీరా ఫౌండేషన్ తన వంతు సహాయ సహకారం అందిస్తుందని చెప్పారు. చీపురుపల్లి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వైద్యరంగం ప్రగతిని సర్వసభ్య సమావేశంలో వివరిస్తున్న వైద్యాధికారి సీతల్‌వర్మ

- అధికారులకు ఎంపీపీ గోపెమ్మ ఆదేశం

కొత్తవలస: మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రస్తావించిన ప్రజాసమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ ల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వై.పద్మజ ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 21 విభాగాల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. చిన్నరావుపల్లి సర్పంచ్, కాటకాపల్లి ఎంపీటీసీ మాట్లాడుతూ తమ పంచాయతీల్లో విద్యుత్‌శాఖ పనితీరు దారుణంగా ఉందని ధ్వజమెత్తారు. దెందేరు గ్రామంలోని జగనన్న కాలనీకి రోడ్డు వేయడంలో అధికారులు విఫలమయ్యారని, అక్టోబర్-2 నాటికి సమస్య పరిష్కరించకుంటే కాలనీ ప్రాంతంలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి నిరసనకు దిగుతామని ఆ గ్రామ సర్పంచ్ వెంకటరమణ తెలిపారు.అలాగే పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం కాకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సన్యాసినాయుడుని పలువురు ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను వచ్చే సమావేశం నాటికి పరిష్కరించేలా చూడాలని అధికారులకు ఎంపీపీ సూచించారు.వైస్ ఎంపీపీ మేలాస్త్రి సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి, తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా పాల్గొన్నారు.

వైద్యపరీక్షల శిబిరం రేపు

చీపురుపల్లి: స్థానిక లయన్స్‌క్లబ్, లయన్స్‌స్టార్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉచిత వైద్యపరీక్షల శిబిరం నిర్వహించను న్నట్లు ఆ క్లబ్‌ల అధ్యక్షులు ఎస్.వి.జి.శ్రీనివాసరావు, ఎస్.దుర్గారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఉదయం 6 గంటల నంచి 8 వరకు వైద్య పరీక్షలు నిర్వహణ శిబిరం కొనసాగు తుందని తెలిపారు. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందుల పంపిణీ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఆక్రమణల పరిశీలన



కాలువ స్థలంలో అక్రమనిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గురుమూర్తి

దత్తిరాజేరు: షికారుగంజి కూడలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్తబంద చెరువుకు సంబంధించిన సాగునీటి కాలువ ఆక్రమణలను తహసీల్దార్ గురుమూర్తి బుధవారం పరిశీలించారు. కె.కొత్తవలసకి చెందిన రైతు మడక సింహాచలం ఫిర్యాదు మేరకు తహసీల్దార్ విచారణ చేశారు. కాలువ ఆక్రమణలను తహసీల్దార్ నిర్ధారించారు. ఫిర్యాదుదారు మాట్లాడుతూ గతంలో కాలువ విశాలంగా ఉండడం వల్ల వరదలు వచ్చేటప్పుడు పంట పొలాలకు ఇబ్బంది ఉండేది కాదని, కాలువ స్థలంలో నిర్మాణాలు చేపట్టడం వల్ల భారీ వర్షాలకు నీరు పొలాల్లో నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ ఆక్రమణలు తొలగించి, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మణిపూర్ ఘటన హేయం



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, సీపీఎం నాయకులు

లక్కవరపుకోట: మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, హతమార్చిన ఘటన అత్యంత హేయమని సీపీఎం నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ అన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో ప్రమేయం ఉన్న వారందరినీ శిక్షించాలని కోరుతూ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద విద్యార్థినులతో సీపీఎం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండను ఆపి అక్కడ శాంతిని నెలకొల్పాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేసి పరిస్థితులను చక్కదిద్దాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ విషయంపై మాట్లాడకపోవడాన్ని వారు తప్పు పట్టారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సందర్శన

వేపాడ: కొండగంగుబూడి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.పట్నాయక్ బుధవారం సందర్శించారు. కేంద్రం నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీపై గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేశారు.

ఆంగ్లంపై పట్టుసాధించేలా బోధన



చీపురుపల్లి: మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు



కొత్తవలస: కంటకాపల్లి హైస్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

చీపురుపల్లి: ప్రతీ విద్యార్థి ఆంగ్లంపై పట్టుసాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు సూచించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమికస్థాయి పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంగ్లిష్ సామర్థ్యం పెంపొందించేందుకు టీఓఈఎఫ్ఎల్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. పాఠశాల సముదాయ సమా వేశాలకు ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌లు జానకీరామ్, ఎస్.వి. అప్పలనాయుడు, సీఆర్పీ కంది రామకృష్ణ, పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన

గజపతినగరం: 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సులభంగా ఇంగ్లిష్ నేర్చుకునేలా బోధించే విధానాలను శిక్షకుడు ఆర్.వెంకటరమణ ఉపాధ్యాయులకు వివరించారు. పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో హైస్కూల్ స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలోని ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఆంగ్లం బోధనలో నైపుణ్యాలు, మెలకువలను వివరించారు.అలాగే పురిటిపెంట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో పాటించాల్సిన విధానాలను ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ్ క్రాంతి, శిక్షకులు జనార్దన్ వివరించారు. మండల రిసోర్స్ పర్సన్ కె.లత, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి, సీఆర్పీలు శ్రీనివాసరావు, రెడ్డి పాల్గొన్నారు.

డీఈఓ పరిశీలన

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి, వియ్యంపేట పాఠశాలలు, మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి పరిశీలించారు. బోధనలో మెలకువలపై మండలంలో 6 నుంచి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు కంటకాపల్లి హైస్కూల్ లో, 3 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు కొత్తవలస, వియ్యంపేట హైస్కూళ్లలో శిక్షణ ఇచ్చారు. అనంతరం అడ్డూరువానిపాలెంలోని కేజీబీవీని సందర్శించి, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఎంఈఓలు జి.శ్రీదేవి,బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



గజపతినగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గజపతినగరం: మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మండల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పురిటిపెంట సచివాలయం-1లో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సచివాలయ భవన నిర్మాణం పూర్తయినా ఇంకా ఎందుకు ప్రారంభించ లేదని అధికారులను ఆరా తీశారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రసాద్, అప్పలనాయుడు స్పందిస్తూ వారం రోజుల్లో సచివాలయ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. అలాగే పురిటిపెంటలో వెల్ నెస్, రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి వెల్‌నెస్ సెంటర్‌ను ఆగస్టు 31న, రైతుభరోసా కేంద్రాన్నిసెప్టెంబర్ 15లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షాలకు కార్యాలయ గదుల్లోకి నీరు చిమ్ముతోందని తహసీల్దార్ అరుణకుమారి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ మరమ్మతులకు ఎస్టిమేషన్‌లు తయారు చేసి పంపించాలని చెప్పారు. ఆమెవెంట బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ, బొబ్బిలి డీఎల్‌డీఓ ఆర్.రవీంద్ర, ఎంపీడీఓ కిశోర్‌కు మార్, ప్రజాప్రతినిధులు కరణం ఆదినారాయణ, మండల సురేష్ తదితరులు ఉన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ ఎం.నాగలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఎంత నిధులు మంజూరయ్యాయి, ఏయే పనులు చేపట్టారు తదితర వివరాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

కార్గిల్ యుద్ధవీరులకు నివాళి



గుర్ల: ర్యాలీ చేస్తున్న గుర్ల జూనియర్ కళాశాల విద్యార్థులు



చీపురుపల్లి: కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఆశయ రమణ, యువత



శృంగవరపుకోట: సంతగవిరమ్మపేట పాఠశాలలో విశ్రాంత సైనికుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్‌లను జాతి ఎన్నటికీ మరువదని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలు విడిచిన జవాన్లకు నివాళి అర్పించారు.

గుర్లలో ర్యాలీ

గుర్ల: కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికునికి సన్మానం

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం కె.బంగారునాయుడు ఆధ్వర్యంలో కార్గిల్ దివస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా కార్గిల్ అమరవీరులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళి అర్పించారు. అనంతరం విశ్రాంత సైనికుడు పొట్నూరు ఎల్లారావును సన్మానించారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా...

- గ్రామాల్లో వైద్య శిబిరాలు



శృంగవరపుకోట: రేగపుణ్యగిరిలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది



గజపతినగరం: పురిటిపెంటలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి



వేపాడ: దిబ్బపాలెంలో నిర్వహించిన శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

శృంగవరపుకోట: మండలంలోని గిరిశిఖర గ్రామం రేగ పుణ్యగిరిలో కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి జి.హారిక ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 42 మందికి బీపీ, షుగర్, హెచ్‌బీ, జ్వర పరీక్షలు చేశారు. పలువురు గిరిజనుల నుంచి రక్తపూతలు సేకరించారు. అలాగే 11మంది పిల్లలు కండ్లకలక సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హెచ్‌వీ వీరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సుశీల, హెల్త్ అసిస్టెంట్ శంకరరావు, ఏఎన్‌ఎం పార్వతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో...

వేపాడ: కొండగంగుబూడి పంచాయతీ దిబ్బపాలెం గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ వైద్యపరీక్షలు చేసి ఆరోగ్యజాగ్రత్తలను వివరించారు. శిబిరాన్ని ఎంపీడీఓ పట్నాయక్ సందర్శించి, ఓపీ నమోదును పరిశీలించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం-2 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సి వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో 96 మందికి వైద్యపరీక్షలు చేశారు. అనారోగ్యంతో ఉన్న వారికి మందులు అందజేశారు. అనంతరం గృహ సందర్శన చేసి ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్యకార్యకర్త సత్యవతి, ఆశ కార్యకర్తలు ఉమ, భారతి తదితరులు పాల్గొన్నారు.

చమురు ధరలు తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గజపతినగరం: సామాన్యుడి నడ్డి విరిచేలా పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్రప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులతో కలిసి తహసీల్దార్ ఎం.అరుణకుమారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కేంద్రప్రభుత్వం ఆటో, మోటారు వాహనాలపై అనేక రూపాల్లో పన్నులు వేసిందని, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారిని మరింత ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు నిత్యం పెరిగి పోతుండడంతో సామాన్యులకు కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించాలని కోరారు. అలాగే జీఓ నంబర్ 21,31లను రద్దు చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బి.రాంబాబు, సీహెచ్.సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.